e ESHAGNA
ఛానల్‌కి సంబంధించిన Pvt Ltd ( Broadcasting ), MSME , Trademark , Food License (Fssai) , ISI License , RNI , Trust (12A-80G), రిజిస్ట్రేషన్ చేయబడును
RTMP సర్వర్ KEY, E పేపర్ వెబ్సైట్, న్యూస్ వెబ్సైట్ చేయబడును.

Registered No : APTEL/25/A1201

# గాయత్రి వార్తలు

జాతీయ తెలుగు దిన పత్రిక



విలేకరులు కావలెను
గాయత్రి వార్తలు జాతీయ తెలుగు దినపత్రికలో ఆంధ్ర ప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాలలోని అన్ని నియోజకవర్గ, మండల కేంద్రాలలో పనిచేయుటకు ఆసక్తి గల విలేకరులు కావలెను. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత ఇవ్వబడును
యం. నాగేశ్వర రావు
ఎడిటర్ గాయత్రి వార్తలు
సెల్ : 73860 45673

PUBLISHED FROM : DELHI - MAHARASHTRA - ANDHRA PRADESH - TELANGANA - KARNATAKA - TAMILANADU - GOA - LOCKNOW - EDITOR : M. NAGESWARARAO

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్ మంగళవారం 19-05-2026 సంపుటి : 1 సంచిక :328 ఎడిటర్ : యం నాగేశ్వరరావు పేజీలు : 4 వెల రు : 2/-

## అన్ని రాష్ట్రాల హైకోర్టులకు సీజేఐ సూచనలు

అన్ని రాష్ట్రాల హైకోర్టు సీజేలకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచనలు చేశారు. కేసుల విచారణలో సుప్రీంకోర్టు అనుసరిస్తున్న విధానాన్ని పాటించాలని సూచించారు. సోమ, శుక్ర వారాల్లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా విచారణలు చేయాలన్నారు.



## నెదర్లాండ్స్, స్వీడన్‌లతో వ్యూహాత్మక బంధం

*రక్షణ, విలువైన ఖనిజాలవంటి రంగాలపై ఒప్పందాలు భారత ప్రధాని సమక్షంలో సంతకాలు*

ది హేగ్ (నెదర్లాండ్స్), గోథెన్‌బర్గ్ (స్వీడన్): ప్రపంచ భౌగోళిక రాజకీయాలు మారిపోతున్న తరుణంలో నెదర్లాండ్స్, స్వీడన్‌లతో తమ భాగస్వామ్య బంధాన్ని వ్యూహాత్మక స్థాయికి తీసుకువెళ్లాలని భారత్ నిర్ణయించింది.



# నిర్దేశిత గడువులోగా ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి కావాలి

**నిర్దేశిత గడువులోగా ఇరిగేషన్ ప్రాజెక్టులు పూర్తి కావాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు.**



పోలవరం సహా సాగునీటి ప్రాజెక్టులపై సోమవారం ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, సీఎస్ సాయి ప్రసాద్, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. నీటి నిర్వహణలో సాగునీటి సంఘాలతోపాటు ప్రజలను కూడా భాగస్వాములను చేసేలా చర్యలు చేపట్టాలని సీఎం దిశానిర్దేశం చేశారు. భూగర్భ జలాలను సద్వినియోగం చేసుకునేలా స్వల్ప, మధ్య, దీర్ఘకాలిక ప్రణాళికలను సిద్ధం చేయాలని ఆదేశించారు.

## 60 ఏళ్లనాటి ప్రతిపాదనకు కార్యరూపం



నూతన విద్యా సంవత్సరంలో జులై 1 నుంచి తొమ్మిదో తరగతిలో త్రిభాషా సూత్రాన్ని తప్పనిసరిగా అమలు చేయాలని 'కేంద్ర మాధ్యమిక విద్యా మండలి' (సీబీఎస్‌ఈ) నిర్ణయించడంతో 60 ఏళ్ల క్రితం నాటి ప్రతిపాదన కార్యరూపం దాల్చినట్లైంది.

## కేబీఆర్ పార్కు పరిధిలో చెట్లను నరకొద్దు: సుప్రీం కోర్టు

నగరంలోని కేబీఆర్ పార్కు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణంపై సుప్రీం కోర్టులో విచారణ జరిగింది.



## అమెరికా మినహాయింపులు లేకున్నా.. రష్యా నుంచి భారత్ చమురు కొనుగోళ్లు




దేశీయ ఇంధన అవసరాలు, ప్రయోజనాలకు అనుగుణంగానే ముడి చమురు దిగుమతులు ఉంటాయని కేంద్ర ప్రభుత్వం పునరుద్ఘాటించింది. అమెరికా ఆంక్షల సడలింపు ఉన్నా, లేకపోయినా రష్యా నుంచి చమురు కొనుగోళ్లు కొనసాగుతాయని స్పష్టం చేసింది.

## తెలంగాణలో పలు జిల్లాలకు వర్షసూచన



## విశాఖ కేజీహెచ్‌లో సీఓసీ హిమోగ్లోబినోపతీస్ సెంటర్ ప్రారంభం



## రెండేళ్లలో ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన నదీజలాలు: మంత్రి నారాయణ



## న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో నమ్మకమైన భాగస్వామిగా ఏపీ: మంత్రి నారా లోకేశ్

**కొత్త పారిశ్రామిక కారిడార్లను నిర్మిస్తున్నామని..**




భవిష్యత్ న్యూక్లియర్ ఆర్థిక వ్యవస్థలో ఆంధ్రప్రదేశ్‌ను నమ్మకమైన గ్లోబల్ భాగస్వామిగా నిలబెట్టడమే తమ ధ్యేయమని రాష్ట్ర మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రపంచ న్యూక్లియర్ ఎనర్జీ పరిశ్రమ కొత్త దశలోకి ప్రవేశిస్తున్న నేపథ్యంలో ఇది కీలకంగా మారుతుందని చెప్పారు.

భారత్‌లో ఇంజినీరింగ్ ప్రతిభ, తయారీ రంగంలో విస్తృతి, ఖర్చు విషయంలో పోటీతత్వం ఉన్నాయని మంత్రి లోకేశ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు పారిశ్రామిక ఇన్‌ఫ్రా, పోర్ట్స్, లాజిస్టిక్స్ కనెక్టివిటీ అమలు సామర్థ్యాన్ని కలిగి ఉన్నాయని చెప్పారు. ముఖ్యంగా ఏపీకి ఎన్నో అదనపు ప్రయోజనాలు ఉన్నాయని మంత్రి వివరించారు.

## బండి సంజయ్ తప్పు చేయలేదు: రాంచందర్‌రావు

- కేంద్ర మంత్రి బండి సంజయ్‌తోపాటు భాజపాపై రాష్ట్రంలోని రాజకీయ పార్టీలు దుష్ప్రచారం చేస్తున్నాయని తెలంగాణ భాజపా అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు.
- వ్యక్తిని, కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకొని తప్పుడు ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు.
- రూ.కోట్లు ఖర్చుపెట్టి రాష్ట్రమంతా పోస్టర్లు వేయించారు. బండి సంజయ్ తప్పు చేయలేదు.
- ఆయన కుటుంబ సభ్యులు తప్పు చేస్తే.. న్యాయపరంగా చర్యలుంటాయి.
- 'బేటీ పడావో.. బేటీ బచావో' నినాదాలతో మాత్రమే సరిపోదని విమర్శ



# ఆలయ దిక్సూచి పై అన్యమత ప్రచారం

- తీవ్రంగా ఖండించిన బిజెపి ధార్మికశాఖ జిల్లా కో కన్వీనర్ వాడపల్లి లక్ష్మాణాచార్యులు
- అన్యమత పోస్టర్లను వెంటనే తొలగించాలని డిమాండ్





గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

ద్వారకాతిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి వెళ్లే ప్రధాన మార్గంలో ఏర్పాటు చేసిన ఆలయ దిక్సూచిపై, పరిసర ప్రాంతాలను అన్యమత ప్రచార పోస్టర్లను అతికించడాన్ని భారతీయ జనతా పార్టీ ధార్మిక శాఖ జిల్లా కో కన్వీనర్ వాడపల్లి లక్ష్మాణాచార్యులు తీవ్రంగా ఖండించారు. భక్తుల ఆధ్యాత్మిక భావాలను దెబ్బతీసే విధంగా జరిగిన ఈ చర్య వెనుక ఉన్న వారిపై తక్షణమే విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకోవాలని భారతీయ జనతా పార్టీ ధార్మిక సెల్ తరపున ఆయన డిమాండ్ చేశారు.ద్వారకాతిరుమల వంటి పవిత్ర క్షేత్రానికి వచ్చే భక్తులకు మార్గదర్శకంగా ఉండాల్సిన దిక్సూచిని లక్ష్యంగా చేసుకుని అన్యమత ప్రచారం చేయడం దేవస్థాన పవిత్రతను అవమానించే చర్య అని విమర్శించారు.ఇటువంటి చర్యలు సమాజంలో మత సామరస్యాన్ని దెబ్బతీసే ప్రమాదం కలిగిస్తాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించాలి : ఆ పోస్టర్లను తొలగించాలని,బాధ్యులపై కేసులు నమోదు చేయాలని,భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు.హిందూ దేవాలయాల గౌరవం, పవిత్రతను కాపాడడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, దేవస్థానాల పరిసరాల్లో మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా జరిగే చర్యలను బీజేపీ ధార్మిక సెల్ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని తెలిపారు.

# ఇంధన ధరలపై మాట్లాడే హక్కు లేదు జగన్ : టిడిపి నేతలు



శ్రీకాళహస్తి, మే 18, గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్

వైసీపీ ప్రభుత్వ హయాంలో పెట్రోల్, డీజిల్ ధరలను అమాంతం పెంచి ప్రజలపై భారీ భారం మోపిందని వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, తెలుగుదేశం పార్టీ నాయకుడు వజ్రం కిషోర్ తీవ్ర విమర్శలు చేశారు.శ్రీకాళహస్తిలో నిర్వహించిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ.. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన సమయంలో రాష్ట్రంలో పెట్రోల్ ధర రూ.76, డీజిల్ ధర రూ.68గా ఉండగా, 2020 నాటికి పెట్రోల్ రూ.107, డీజిల్ రూ.99కు చేరిందన్నారు. ఒక్క ఏడాదిలోనే లీటర్‌పై రూ.31 వరకు పెంచి ప్రజల నడ్డి విరిచిందని ఆరోపించారు.రోడ్డు సెస్, వ్యాట్, అదనపు వ్యాట్ పేర్లతో జగన్ ప్రభుత్వం ప్రజలపై అదనపు భారాలు మోపిందని విమర్శించారు. కరోనా సమయంలో ఇతర రాష్ట్రాలు ఇంధన ధరలను తగ్గించినప్పటికీ, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం పైసా కూడా తగ్గించలేదని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం సూచనలు చేసినా ప్రజలపై పన్నుల భారం తగ్గించడంలో జగన్ ప్రభుత్వం విఫలమైందన్నారు.ప్రస్తుతం అంతర్జాతీయ పరిస్థితుల కారణంగా ఇంధన ధరలు స్వల్పంగా పెరిగాయని, అయితే వైసీపీ హయాంలో జరిగిన భారీ పెరుగుదలతో పోల్చితే అది చాలా తక్కువేనని తెలిపారు. జగన్ రెడ్డి ప్రజలపై 'బాదుడు' పాలన నడిపారని ఆరోపిస్తూ, ప్రస్తుతం చేస్తున్న విమర్శలు ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నమని అన్నారు.ఈ కార్యక్రమంలో డా. యం. ఉమేష్ రావు, బీమాల భాస్కర్ ముదిరాజ్, కోట చంద్రశేఖర్, మురళీ నాయుడు, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# విద్యాభివృద్ధికి ఏటా 32 వేల కోట్లు కేటాయింపు

- విద్యాభివృద్ధితోపాటు యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి
- రాష్ట్రంలోని 25 లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు.
- కొలుసు పెద్ద రెడ్డయ్య చారిటబుల్ ట్రస్ట్ తరపున విద్యార్థులకు నగదు పురస్కారం
- రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్

రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అత్యంత ప్రాధాన్యతను ఇస్తుందని , విద్యాభివృద్ధికోసం ఏటా 32 వేల కోట్ల రూపాయలకు పైగా వెచ్చిస్తున్నదని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం కొలుసు పెద్ద రెడ్డయ్య చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో మండల స్థాయిలో మొదటి ఐదు స్థానాలలో నిలిచిన 25 మంది విద్యార్థినీ, విద్యార్థులకు 3 లక్షల రూపాయలు నగదు బహుమతిని అందజేసి, దుశ్శాలువా, మెమొంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మంత్రి పార్థసారధి మాట్లాడుతూ ప్రపంచంలో విద్యకు మించిన ఆస్థి లేదని, పేదల తలరాతను మార్చేది విద్య అని, సమాజాభివృద్ధికి విద్య ఎంతో ముఖ్యమన్నారు. ప్రతిభ ఉన్న విద్యార్థులను ప్రోత్సహిస్తే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధిస్తారన్నారు. ప్రభుత్వ విద్య వ్యవస్థను సమూలంగా మార్చి, కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఫలితాలు సాధించేలా ప్రభుత్వ విద్యా వ్యవస్థను తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు , విద్యా శాఖామంత్రి నారా లోకేష్ ఎంతో కృషిచేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు పూర్తిస్థాయిలో కల్పించడంతో పాటు, పౌష్టికాహారంతో కూడిన మధ్యాహ్న భోజనం, విద్యా కిట్లు అందిస్తున్నారని, 16600 మంది ఉపాధ్యాయులను గత సంవత్సరం డీఎస్సీ ద్వారా నియమించారని, ఈ విద్యా సంవత్సరం మరో 10 వేల మంది ఉపాధ్యాయుల నియామకానికి చర్యలు చేపడుతున్నారన్నారు. విద్యాభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వడమేకాక ఉన్నత చదువులు చదివిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, కూటమి ప్రభుత్వం 5 ఏళ్లలో 25 లక్షల మంది యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు మంత్రి చెప్పారు. గత ప్రభుత్వ సమయంలో మన రాష్ట్రంలో చదువుకున్న యువత ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగుళూరు వంటి నగరాల వైపు చూసేవారని, హైదరాబాద్ లో సమాచార సాంకేతిక వ్యవస్థను అభివృద్ధి చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పాలనలో క్వాంటం వాలి, గూగుల్ డేటా సెంటర్ వంటి ఎన్నో కంపెనీలు తమ సంస్థలను మన రాష్ట్రంలో నెలకొల్పి మన యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామన్నారు. గత విద్యా సంవత్సరంలో జిల్లాలో ఎస్సెస్సీ లో 72 శాతం ఉతీర్ణత సాధించారని, ఈ విద్యా సంవత్సరంలో 80 నుండి 90 శాతానికి ఉతీర్ణతను సాదించేందుకు ఉపాధ్యాయులు, విద్యా శాఖ అధికారులు పటిష్టమైన ప్రణాళిక రూపొందించుకుని అమలు చేయాలనీ మంత్రి ఆదేశించారు. పదవ తరగతిలో మండల స్థాయిలో మొదటి 5 స్థానాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు మొదటి స్థానం సాధించిన వారికి 25 వేల రూపాయలు, రెండవ స్థానం సాధించిన వారికి 15 వేలు, మూడవ స్థానం సాధించిన వారికి 10 వేలు, 4,





5 స్థానాలు సాధించిన వారికి 5 వేల రూపాయలు చొప్పున నగదు బహుమతితో పాటు దుశ్శాలువా, మెమెంటోలతో కొలుసు పెద్ద రెడ్డయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా సత్కరిస్తున్నామన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అభ్యసించి ఐఐటీ లో సీటు సాధించిన వారికి షెడ్యూల్డ్ తెగల విద్యార్థులకు లక్ష రూపాయలు, ఎస్సీ లకు 75 వేలు, బిసి లకు 50 వేలు, ఇతరులకు 25 వేల రూపాయలు చొప్పున ప్రోత్సాహక బహుమతులను అంతేకాక ప్రభుత్వ పాఠశాలల్లో ఫలితాల మెరుగుదలకు ప్రతీ సంవత్సరం డిసెంబర్, 21 నుండి ఏప్రిల్,26వ తేదీ వరకు 100 రోజులపాటు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారని, పాఠశాలల్లో ఉదయం నుండి సాయంత్రం వరకు విద్యను అభ్యసించే విద్యార్థినీ, విద్యార్థులకు 7 రకాలతోకూడిన పౌష్టికాహార కిట్లను ట్రస్ట్ ద్వారా 100 రోజులపాటు ప్రతీ రోజు ప్రతీ విద్యార్థికి అందిస్తున్నామన్నారు. నూజివీడులో కుమార్ స్కూల్ లో ఎస్సెస్సీ లో రాష్ట్రస్థాయిలో 2వ స్థానం సాధించిన రజియా బేగం ను మంత్రి దుశ్శాలువా, మెమెంటోతో సత్కరించి అభినందించారు.

# ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్



కుక్కునూరు మండలం అల్లిగూడెం గ్రామ పరిధిలోని నల్లజర్ల నవీన్ జామాయిల్ నర్సరీ వద్ద జరిగిన ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ మృతి చెందిన సంఘటనపై కుక్కునూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.ఎస్సై రాజారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం వెంకటాపురం గ్రామానికి చెందిన జెట్టి అభిషేక్ (23)గత ఒక సంవత్సరంగా తోట శ్రీనివాసరావు వద్ద ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం ఉదయం ఎపి 20 ఎకె 1520 నంబరు గల ట్రాక్టర్ లో కోకోపీట్‌ను అల్లిగూడెంలోని నల్లజర్ల నవీన్‌కు చెందిన జామాయిల్ నర్సరీకి తరలిస్తున్నాడు.నర్సరీ గేటు మూసి ఉండటంతో ట్రాక్టర్‌ను ఆపి గేటు తీయడానికి దిగాడు. ఈలోగా ప్రవేశద్వారం వద్ద దిగువ స్లోప్ ఉండటంతో ట్రాక్టర్ స్వయంగా ముందుకు కదలడం ప్రారంభించింది. ఎదురుగా షెడ్/ఇల్లు ఉండటంతో ట్రాక్టర్‌ను అదుపు చేయడానికి తిరిగి ఎక్కే ప్రయత్నంలో కాలుజారి ట్రాక్టర్ చక్రం కింద పడటంతో అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడి తల్లి జెట్టి రాములమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

# డయాలసిస్ సెంటర్ అదనపు భవనానికి శంకుస్థాపన

- కేంద్రమంత్రి శ్రీనివాస్ వర్మ , ఎమ్మెల్యే శ్రీనివాసు చేతులమీదుగా పనులు ప్రారంభం

గాయత్రి వార్తలు ఏలూరు జిల్లా ఇంఛార్జి బి ప్రభాకర్





తాడేపల్లిగూడెం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ ఆవరణంలో రూ.2కోట్లు ఎంపీ నిధుల తో డయాలసిస్ సెంటర్ అదనపు భవనానికి సోమవారం శంకుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. కేంద్ర మంత్రి శ్రీనివాస్ వర్మ, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాసు శంకుస్థాపన కార్యక్రమంలో కొబ్బరికాయ కొట్టి పనులను ప్రారంభించారు. తాడేపల్లిగూడెంలో డయాలసిస్ సెంటర్ ఉన్నప్పటికీ, పెరుగుతున్న డయాలసిస్ పేషెంట్లను దృష్టిలో ఉంచుకొని అదనపు భవనం నిర్మించాలంటూ ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అభ్యర్థన మేరకు రెండు కోట్ల రూపాయలతో భవనాన్ని నిర్మించినట్లు ఆయన తెలిపారు. జిల్లా కేంద్రమైన భీమవరంలో డయాలసిస్ సెంటర్ నిర్మించాలని తలపెట్టినప్పటికీ, తాడేపల్లిగూడెంలో డయాలసిస్ సెంటర్ అత్యవసరమైన భావించి డయాలసిస్ సెంటర్ అదనపు భవనాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. వందే భారత్ ట్రైన్ తాడేపల్లిగూడెం హాల్ట్ కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయని త్వరలోనే హాల్టు వస్తుందని ఆయన తెలిపారు. తాడేపల్లిగూడెం విమానాశ్రయం నిర్మాణానికి కావలసిన స్థలం ఉంది కాబట్టి దానికి సంబంధించిన కార్యక్రమాలకు ముందుకు తీసుకెళుతున్నామని ఎంపీ తెలిపారు.

# వైసీపీ నిరసనలు సిగ్గుచేటు : టీడీపీ రాష్ట్ర కార్యదర్శి మాసారపు సుబ్బయ్య

శ్రీకాళహస్తి, మే 18, గాయత్రి వార్తలు:రిపోర్టర్ : రంజిత్



డీజిల్, పెట్రోల్ ధరల పెరుగుదలపై వైసీపీ నిరసనలకు పిలుపునివ్వడం సిగ్గుచేటని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి మాసారపు సుబ్బయ్య విమర్శించారు.ఆయన మాట్లాడుతూ.. 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వం పలుమార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచిందని, అలాంటి పార్టీకి ప్రస్తుతం ధరల పెరుగుదలపై మాట్లాడే నైతిక హక్కు లేదని ప్రశ్నించారు.ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో పెరిగిన ఇంధన ధరలు రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాల వల్ల కాదని, అంతర్జాతీయ యుద్ధ పరిస్థితుల ప్రభావంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన చర్యల ఫలితమని తెలిపారు. దీనిని రాజకీయ లాభాల కోసం వాడుకోవాలని వైసీపీ ప్రయత్నించడం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధం లేని అంశాలపై ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని ప్రకటించడం వైసీపీ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజల్లో తమ ఉనికిని కాపాడుకోవడానికి అనవసర ఆందోళనలు చేపట్టినా ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు.దేశవ్యాప్తంగా ఆర్థిక సవాళ్లు ఉన్నప్పటికీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దూరదృష్టితో రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్నారని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో అసత్య ఆరోపణలు చేసి మరోసారి ప్రజల్లో విమర్శలకు గురికావద్దని వైసీపీ నాయకులకు హెచ్చరించారు.

# జె.బి.ఎస్ క్రికెట్ టోర్నమెంట్ ఘన ముగింపు

- విజేతలకు కప్ అందజేసిన కాంగ్రెస్ మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీ షేక్ కరీముల్లా, మురళి నాయుడు, హరి

శ్రీకాళహస్తి, మే 18, గాయత్రి వార్తలు :రిపోర్టర్ : రంజిత్





శ్రీకాళహస్తి పట్టణంలోని ఎస్.వి.ఏ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల గ్రౌండ్‌లో నిర్వహించిన జె.బి.ఎస్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. నేతాజీ , మురళి నాయుడు, అర్జున్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌లో ఎస్.సి.సి క్రికెట్ క్లబ్ మురళి, వర్మ జట్టు అద్భుత ప్రదర్శన కనబరిచి విజేతగా నిలిచింది.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ జనరల్ సెక్రటరీ షేక్ కరీముల్లా హాజరై విజేతలకు కప్ అందజేసి అభినందనలు తెలిపారు. రన్నర్స్‌గా నిలిచిన పోలీస్ లెవెన్స్ జట్టుకు హెడ్ మాస్టర్ హరి ట్రోఫీ, టోర్నీలో మంచి ప్రదర్శన కనబరిచిన రాజీవ్ నగర్ టీం కి ఫెయిర్ ప్లే అవార్డును పీ.సీ పెంచల్ కుమార్ అందజేశారు అలాగే బెస్ట్ బ్యాట్స్మెన్ గా చుక్కల నిడిగల్లు టీం ప్లేయర్ భరత్ నిలిచాడు .ఈ సందర్భంగా షేక్ కరీముల్లా మాట్లాడుతూ యువత చెడు అలవాట్లు, చెడు మార్గాల వైపు వెళ్లకుండా క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఐకమత్యం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. శారీరక, మానసిక దృఢత్వానికి క్రీడలు ఎంతో దోహదపడతాయని అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన యువ ఆటగాళ్లను వెలికితీసేందుకు నిర్వాహకులు నేతాజీ , మురళి నాయుడు, అర్జున్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు. భవిష్యత్తులో మరిన్ని క్రీడా పోటీలు నిర్వహించి యువతకు అవకాశాలు కల్పించాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో స్థానిక యువకులు, క్రీడాభిమానులు, పలువురు నాయకులు పాల్గొని విజేతలకు శుభాకాంక్షలు తెలిపారు.

# రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలకు మంత్రి సుభాష్ మానవతా అండ

**– చీడిగ విషాదంలో బాధిత కుటుంబాలకు రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం**

**– మంత్రి సుభాష్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ కు కృతజ్ఞతలు తెలిపిన బాధిత కుటుంబ సభ్యులు**

కాకినాడ, నంబూరి టైమ్స్ :-

కాకినాడ రూరల్ మండలం కొవ్వూరు సమీప బైపాస్ రోడ్డులో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఐదుగురు మహిళా ఉపాధి శ్రామికుల కుటుంబాలకు రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మానవతా దృక్పథంతో అండగా నిలిచారు. కష్టకాలంలో ఉన్న బాధిత కుటుంబాలకు శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్ (ఎస్ఏఎఫ్), సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొత్తం రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం అందజేశారు. సోమవారం అమరావతి నుంచి వీడియో కాల్ ద్వారా బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడిన మంత్రి వాసంశెట్టి సుభాష్ వారికి ధైర్యం చెప్పి ఓదార్చారు. ప్రతి కుటుంబానికి వ్యక్తిగత సహాయం అందించడంతో పాటు ప్రభుత్వపరంగా కూడా సహాయం అందేలా కృషి చేస్తానన్నారు. ఎస్ఏఎఫ్ ద్వారా నలుగురు మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.50 వేల చొప్పున రూ.2 లక్షలు, మరో దళిత మహిళ కుటుంబానికి సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ద్వారా రూ.50 వేల సహాయం అందజేశారు. మంత్రి ఆదేశాల మేరకు నాయకులు నులుకుర్తి వెంకటేశ్వరరావు, చొల్లంగి వేణుగోపాల్, గుత్తుల శ్రీనివాస్, యనమదల రవి, కడలి శివ, టేకుమూడి శ్రీనివాస్, కొండా వినాయక్, గీసాల శ్రీనివాస్, వాసంశెట్టి భీమరాజు, వాసంశెట్టి అంజిబాబు, అనసూరి సతీష్, వి. మహేష్ తదితరులు చీడిగ గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పొట్టకూటి కోసం ఉపాధి పనులకు వెళ్లిన నిరుపేద మహిళలు లారీ డ్రైవర్



నిర్లక్ష్యంతో ప్రాణాలు కోల్పోవడం అత్యంత హృదయ విదారకమన్నారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వ పరంగా కూడా అన్ని విధాల సహాయం అందేలా మంత్రి వాసంశెట్టి సుభాష్ ప్రత్యేకంగా కృషి చేస్తారని భరోసా ఇచ్చారు. సామాజిక సేవలో ఎల్లప్పుడూ ముందుండే ఎస్ఏఎఫ్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ ప్రజల పక్షాన నిలిచి ఆర్థిక సహాయం అందించి మానవత్వం చాటుకున్నారన్నారు. ఆర్థిక సహాయం అందుకున్న బాధిత కుటుంబ సభ్యులు మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ అధినేత వాసంశెట్టి సత్యంకు కృతజ్ఞతలు తెలిపారు.

# కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించాలి

**– నియోజకవర్గ వై ఎస్ ఆర్ సి పి ఇంచార్జి పిల్లి సూర్య ప్రకాష్**

రామచంద్రపురం, నంబూరి టైమ్స్ :-



స్థానిక పట్టణ వై ఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి భారీ ర్యాలీగా బయలుదేరి రాష్ట్రంలో పెరిగిన డీజిల్, పెట్రోల్ ధరలకు నిరసనగా సోమవారం రెవెన్యూ డివిజనల్ అధికారి కి నియోజకవర్గ ఇంచార్జ్ పిల్లి సూర్య ప్రకాష్, రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ లు నాయకులు, కార్యకర్తలతో కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా పిల్లి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ, పెరిగిన ఇంధన ధరల వల్ల సామాన్య ప్రజలు, రైతులు, కార్మికులు, ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి ప్రజలకు ఉపశమనం కల్పించాలని డిమాండ్ చేశారు. రాజ్యసభ సభ్యులు పిల్లి సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై అదనపు భారం మోపకుండా తక్షణమే ధరలను నియంత్రించాలని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల తరపున పోరాటం కొనసాగిస్తుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమం లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

# సూర్యచంద్ర, ఆయన అనుచరులదాడిలో గాయపడ్డ దళిత నేత మురసత్తిబాబును

**– టిడిపి నాయకులను పరామర్శించిన ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ**

కిర్లంపూడి,/ కాకినాడ జిల్లా మే 18:ఎన్ టైమ్స్ ప్రతినిధి

కిర్లంపూడి మండలం బూరుగుపూడి గ్రామంలో టిడిపి నేతలపై జరిగిన దాడిలో గాయపడిన వారిని జగ్గంపేట ఎమ్మెల్యే, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు జ్యోతుల నెహ్రూ పరామర్శించారు. ఘటన వివరాలు పాఠం శెట్టి సూర్యచంద్ర ఆయన అనుచరులు బూరుగుపూడి గ్రామ టిడిపి నేతలపై దాడి చేయడంతో ఫిషరీస్ చైర్మన్ మురసత్తిబాబు తీవ్రంగా గాయపడ్డారు. కుంచే తాతాజీ, పాఠం శెట్టి బాబ్జి పాక్షికంగా గాయపడ్డారు. ముగ్గురు ప్రస్తుతం ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎమ్మెల్యే స్పందన విషయం తెలుసుకున్న వెంటనే ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఆసుపత్రికి చేరుకుని క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు. సూర్యచంద్ర సొంత సోదరుడు పాఠంశెట్టి బాబ్జి ఆరోపణ సూర్యచంద్ర సోదరుడు బాబ్జి మాట్లాడుతూ -- నారా లోకేష్ పర్యటన నిమిత్తం ఇంటింటికి వెళ్లి ప్రచారం చేస్తుండగా, సూర్యచంద్ర ఇంటి వద్ద ఎమ్మెల్యేపై అసత్య ఆరోపణలతో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారని తెలిపారు. ఆ సమావేశంలో తాము పాల్గొని వివరణ ఇస్తామని చెప్పగానే తమపై మూకుమ్మడిగా దాడి చేశారని ఆరోపించారు. నేను కిడ్నీలు పాడై అనారోగ్యంతో ఉన్నానని అది కూడా చూడకుండా నా సొంత సోదరుడు సూర్యచంద్ర



ఆయన అనుచరులు దారుణంగా దాడి చేశారని బాబ్జి అన్నారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పాల్గొన్నవారు ఈ కార్యక్రమంలో అడపా భరత్, ఎస్ వి ఎస్ అప్పలరాజు, పోతుల మోహనరావు, పాఠం శెట్టి రవి, బోది రెడ్ల సుబ్బారావు, యర్ర బత్తుల గోవిందు నాయుడు, మండపాక అప్పన్న దొర, పాఠం శెట్టి మీసాలు నాగేశ్వరావు, పాఠం శెట్టి కొండ రాజులు, బాలుకుల చిన్నోడు తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి లోకేష్ జగ్గంపేట పర్యటన రద్దు

**– రేపు తాళ్లూరు లో 52 కోట్ల ప్రాజెక్ట్ కు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ శంకుస్థాపన**

కాకినాడ జిల్లా / జగ్గంపేట మే 18:ఎన్ టైమ్స్ ప్రతినిధి



తాళ్లూరులో రైతులకు శుభవార్త. అనివార్య కారణాలతో మంత్రి నారా లోకేష్ పర్యటన రద్దైనప్పటికీ, తాళ్లూరు లిఫ్ట్ ఇరిగేషన్ పథకం పనులు మాత్రం షెడ్యూల్ ప్రకారమే జరగనున్నాయి. రేపు అనగా 19వ తేదీ మంగళవారం ఉదయం 9:00 నిమిషాలకు 52 కోట్ల రూపాయలతో చేపట్టే తాళ్లూరు లిఫ్ట్ పనులకు ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ చేతుల మీదుగా శంకుస్థాపన మహోత్సవం జరగనుంది ఈ ప్రాజెక్ట్ పూర్తయితే తాళ్లూరు పరిసర ప్రాంతాల్లోని 31 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. రైతుల చిరకాల కోరిక నెరవేరనున్న ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రైతులకు, నాయకులకు, పిలుపునిచ్చారు

# ప్రజా దర్బార్‌లో ప్రజల సమస్యలకు వేగవంత పరిష్కారానికి చర్యలు

**– ఎమ్మెల్యే వనమాడి కొండబాబు హామీ**

కాకినాడ, నంబూరి టైమ్స్ :-

ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వేగంగా పరిష్కరించేందుకు ప్రజా దర్బార్ కార్యక్రమం సమర్థవంతమైన వేదికగా నిలుస్తోందని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు పేర్కొన్నారు. సోమవారం కాకినాడ స్మార్ట్ సిటీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన కార్పొరేషన్ అధికారులతో కలిసి పాల్గొని ప్రజల నుండి వినతిపత్రాలను స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేవనమాడి మాట్లాడుతూ ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఒకే వేదికపై తమ సమస్యలను వెల్లడించే అవకాశం కల్పించడమే ప్రజా దర్బార్ ముఖ్య ఉద్దేశమన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి వాటికి సత్వర పరిష్కారం చూపేందుకు అధికారులు సమన్వయంతో పని చేయాలని



సూచించారు. కార్యక్రమానికి నగరంలోని వివిధ డివిజన్ల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరై తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా వితంతు, దివ్యాంగుల పెన్షన్లు, ఇల్లు స్థలాల మంజూరు, త్రాగునీటి సరఫరా, వీధి దీపాల మరమ్మతులు, డ్రైనేజీల శుభ్రత, రహదారుల అభివృద్ధి, మౌలిక వసతుల కల్పన వంటి అంశాలపై ప్రజలు అర్జీలు సమర్పించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మొత్తం దాదాపు 120 అర్జీలు అందాయి.. ప్రతి అర్జీని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు స్వయంగా పరిశీలించి సంబంధిత శాఖ అధికారులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా త్రాగునీటి సరఫరా, విద్యుత్ సమస్యలు, వితంతు పెన్షన్లు వంటి ప్రజల నిత్యావసర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. తక్షణ పరిష్కారం సాధ్యమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని, మిగిలిన వాటిని నిర్దిష్ట గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ కమిషనర్ ఎన్.వి.వి. సత్యనారాయణ, అదనపు కమిషనర్ కె.టి. సుధాకర్, డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్, ఎస్.ఈ. పి. వెంకట్రావు, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ పృథ్వి చరణ్, డీసీపీ కృష్ణారావు, టీపీఆర్వో శైలజ, డీఈ లక్ష్మీనారాయణ, శానిటేషన్ సూపర్వైజర్లు నాయుడు, రాంబాబు, హౌసింగ్ ఏడీ, పి-4 సిబ్బంది తదితర అధికారులు పాల్గొన్నారు.

# పెదకూరపాడు బస్టాండ్ సెంటర్‌లో నిరసన

ఎన్ టైమ్స్ :పెదకూరపాడు



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోల్, డీజిల్ ధరలు పెంచి సామాన్యుల నడ్డి విరుస్తున్నాయని వైసీపీ నేతలు మండిపడ్డారు. సోమవారం పెదకూరపాడు బస్టాండ్ సెంటర్లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి వీఆర్వో కి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ ధరలు తగ్గించాలని, డీజిల్ ధరలు తగ్గించాలని వారన్నారు. సామాన్య ప్రయాణికులు, ద్విచక్ర ఆటో డ్రైవర్లు ఈ పెంపు పై ఇబ్బందులు గురవుతున్నారని వారన్నారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య, అమరావతి వైసిపి మండల పార్టీ అధ్యక్షులు భవిరిశెట్టి హనుమంతరావు, తాడికొండ నియోజకవర్గం పరిశీలకులు ఈదా సాంబిరెడ్డి, మాజీ ఎంపీటీసీ నరేంద్ర, ఆలా లక్ష్మీనారాయణ, నాయుడు, సాంబశివరావు, బత్తుల కోటేశ్వరరావు, గార్లపాటి దాసు, కంచర్ల అచ్యుతరావు, తదితరులు పాల్గొన్నారు.


# స్నేహహస్తం ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి

కనిగిరి, మే 18,ఎన్ టైమ్స్

కనిగిరిలోని ప్రభుత్వ ఆసుపత్రిలో సోమవారం రోజున స్నేహహస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత భోజన వసతి ఏర్పాటు చేయబడింది. ఈ కార్యక్రమం ద్వారా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు, వారి బంధువులకు, నిరాశ్రయులకు, మతిస్థిమితం లేని వృద్ధులకు ఆహారం అందించారు. ట్రస్ట్ అధ్యక్షులు సుధీర్ బాబు మాట్లాడుతూ, "ప్రతి సోమవారం గర్భిణీ స్త్రీలు, డయాలసిస్ చేయించుకునే కిడ్నీ వ్యాధిగ్రస్తులు, మరియు పేద ప్రజలకు మా వంతు సేవ అందిస్తాం. ఆకలితో ఉన్న పేదవారికి ఆహారం ఇవ్వడం మా బాధ్యతగా భావిస్తున్నాం" అని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి సిబ్బంది , స్నేహహస్తం సభ్యులు మీరా మొహిద్దీన్, కిషోర్ బాబు, విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.



# 'పెద్ది'.. ఆయన బయోపిక్ కాదు: క్లారిటీ ఇచ్చిన దర్శకుడు




రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు తెరకెక్కించిన చిత్రం 'పెద్ది'. మల్లయోధుడు కోడి రామ్మూర్తి నాయుడి బయోపిక్‌గా ఇది రూపొందినట్టు ప్రచారం జరిగిన సంగతి తెలిసిందే. దీనిపై దర్శకుడు క్లారిటీ ఇచ్చారు. రామ్మూర్తి బయోపిక్ కాదని స్పష్టం చేసిన ఆయన.. అసలు పెద్ది క్యారెక్టరైజేషన్‌కు స్ఫూర్తి ఎవరన్నదీ చెప్పారు.

"మా ఏరియాలో (తూర్పుగోదావరి జిల్లా) పెద్దిరాజు అనే వ్యక్తి ఉన్నాడు. తాపీ పని చేస్తూనే క్రికెట్, బాస్కెట్ బాల్ బాగా ఆడేవాడు. అతడిది పేద కుటుంబం. ఎవరైనా డబ్బు ఇస్తే వారి తరఫున ఆడేవాడు. అతడిని స్ఫూర్తిగా తీసుకుని, ఫిక్షన్ జోడించి 'పెద్ది' కథను రాశా. చరణ్ నటించిన 'రంగస్థలం' ఈస్ట్ గోదావరి బ్యాక్‌డ్రాప్‌లోనే వచ్చింది. అందుకే ఈ స్టోరీకి విజయనగరం నేపథ్యం తీసుకున్నా. పైగా నాకు ఆ యాస ఇష్టం. ఈ వాతావరణం కథకు పక్కాగా సరిపోతుంది. ఆ ప్రాంతంలో పుట్టిన కోడి రామ్మూర్తి గురించి ఇప్పటి వారికి పెద్దగా తెలియదు. ఫొటో రూపంలోనైనా ఆయన గురించి ఎంతో కొంత చెప్పాలనిపించింది. ఇందులో రామ్మూర్తి ప్రస్తావన వస్తుందంతే. ఆయనకు ఓ శిష్యుడిగా కన్నడ నటుడు శివరాజ్‌కుమార్ నటించారు. శివన్నకు శిష్యుడిగా చరణ్ కనిపిస్తారు" అని తెలిపారు. జూన్ 4న విడుదల కానున్న 'పెద్ది' గురించి బుచ్చిబాబు పంచుకున్న మరికొన్ని విశేషాలివీ..

### 'ఉప్పెన' విడుదలకు ముందే 'పెద్ది' స్టోరీ

"కొవిడ్ టైమ్‌లో నా తొలి సినిమా 'ఉప్పెన'ను నేరుగా ఓటీటీలో విడుదల చేయాలన్న చర్చ జరిగింది. ఏదైనా ఫర్వాలేదు అనుకున్నా. అదే సమయంలో సుకుమార్.. నా తదుపరి ప్రాజెక్టుల గురించి అడిగారు. అప్పుడే 'పెద్ది' పాయింట్ చెప్పా. చాలా కొత్తగా ఉంది.. వెంటనే దీనిపై వర్క్ చేయ్ అని అన్నారు. అలా 'ఉప్పెన' రిలీజ్ కన్నా ముందే పిఠాపురం దత్తాత్రేయ స్వామి ఆలయంలో స్టోరీ రాశా"

### ఖుషి స్థానంలో జాన్వీ


"ఈ సినిమాలో హీరోయిన్‌గా ఖుషి కపూర్‌ని అనుకుని, ఆమెకు కథ చెప్పేందుకు వెళ్లాం. కానీ, ఆమెను చూశాక నా అభిప్రాయం మారింది. ఇందులోని పాత్రకు సరిపోదనిపించింది. ఇదే విషయాన్ని ఖుషి కపూర్ అక్క జాన్వీ కపూర్ చెప్పి, ఆమెను ఎంపిక చేశాం. ఒకరి కోసం వెళ్లి మరొకరిని ఎంపిక చేయడం ఎలా ఉంటుందో అర్థం చేసుకోండి (నవ్వుతూ)" అని అన్నారు.

# 'కాటాలన్' ట్రైలర్ గూస్ బంప్స్..

## ఏనుగు దంతాల మాఫియాపై వైల్డ్ యాక్షన్



మలయాళ నటుడు ఆంటోనీ వర్గీస్ నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'కాటాలన్' . ఇందులో కబీర్ దుహాన్ సింగ్, సునీల్, దుషార విజయన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 'మార్కో' వంటి భారీ యాక్షన్ చిత్రాలను నిర్మించిన క్యూబ్స్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్‌పై షరీఫ్ మహమ్మద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. పాల్ జార్జ్ డైరెక్ట్ చేస్తున్న ఈ మూవీ మే20న తెలుగులోనూ విడుదల కానుంది. ఈ సందర్భంగా చిత్ర బృందం తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది. అడవి నేపథ్యంలో సాగే ఈ ట్రైలర్ మొదటి నుంచే ఆసక్తిని రేకెత్తిస్తూ గూస్‌బంప్స్ తెప్పించేలా ఉంది. అడవుల్లో జరుగుతున్న ఏనుగు దంతాల అక్రమ రవాణా అంశాన్ని ప్రధాన కథాంశంగా తీసుకుని ఈ చిత్రాన్ని రూపొందించినట్లు తెలుస్తోంది. ఏనుగుల వేట చుట్టూ అల్లుకున్న ఈ కథ అత్యంత ఉత్కంఠభరితమైన వైల్డ్ యాక్షన్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకు రానుందని ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. అధికారం కోసం ఆరాటపడే శక్తులకు వ్యతిరేకంగా హీరో ఎలాంటి భయంకరమైన యుద్ధం చేశాడనేది మెయిన్ పాయింట్? అని ట్రైలర్ బట్టి అర్థమవుతుంది. అలాగే రవి బస్రూర్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు మరింత బలం చేకూర్చింది. ముఖ్యంగా ఈ ట్రైలర్‌లో ప్రత్యేకంగా చెప్పుకోవాల్సిన అంశం ఏమిటంటే.. యూట్యూబ్‌లో ట్రైలర్ చూస్తున్న సమయంలోనే సెట్టింగ్స్‌లోకి వెళ్లి ఆడియో ట్రాక్ మార్చుకునే సదుపాయం కల్పించారు. దీంతో మూడు రకాల సౌండ్ వేరియేషన్లలో ట్రైలర్‌ను ఆస్వాదించే అవకాశం ఉంది. ఇండియన్ సినిమాల్లో ఇలాంటి ఫీచర్ చాలా అరుదుగా కనిపించడంతో, ఇది ఒక వినూత్న ప్రయత్నంగా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది.



# బాలయ్య డబుల్ ట్రీట్!

కథానాయకుడు నందమూరి బాలకృష్ణ చేతిలో ప్రస్తుతం రెండు సినిమాలున్నాయి. వీటిలో గోపీచంద్ మలినేని తెరకెక్కిస్తున్న సినిమా చిత్రీకరణ దశలో ఉండగా.. కొరటాల శివ రూపొందించనున్న సినిమా పూర్వ నిర్మాణ పనుల్లో ఉంది. ఇప్పుడీ రెండు ప్రాజెక్టుల నుంచి వరుస అప్‌డేట్లు బయటకు రానున్నట్లు తెలుస్తోంది. జూన్ 10న బాలకృష్ణ పుట్టినరోజు. ఈ సందర్భంగా తన 111వ చిత్ర టైటిల్ గ్లింప్స్‌ను విడుదల చేసేందుకు చిత్ర వర్గాలు సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. ఇక మరోవైపు అదే రోజు కొరటాల సినిమాకి సంబంధించి చిత్రీకరణ విశేషాలతో పాటు కొత్త లుక్ బయటకొచ్చే అవకాశమున్నట్లు తెలిసింది. ఇప్పటికే వీటికి సంబంధించి తెర వెనుక కసరత్తులు మొదలైనట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ రెండు సినిమాల నుంచి అధికారిక ప్రకటనలు వెలువడే అవకాశముంది.



# రాజస్థాన్‌లో 'వృషకర్మ'

నాగచైతన్య కథానాయకుడిగా 'విరూపాక్ష' ఫేమ్ కార్తీక్ దండు తెరకెక్కిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'వృషకర్మ'. బీవీఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్.బి నిర్మిస్తున్నారు. మీనాక్షి చౌదరి కథానాయిక. స్పర్ష్ శ్రీవాస్తవ, జయరామ్, సత్య తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. ప్రస్తుతం ముగింపు దశలో ఉన్న ఈ సినిమా రాజస్థాన్‌లో ఓ కీలక షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. దీనికి సంబంధించిన వర్కింగ్ స్టిల్స్‌ను చిత్ర వర్గాలు సామాజిక మాధ్యమాల్లో పంచుకున్నాయి. సినిమాకి ఆకర్షణగా నిలిచే కీలక ఎపిసోడ్స్‌ని ఈ షెడ్యూల్‌లో తెరకెక్కించారని.. రాజభవనాలు, పురాతన శిల్పకళతో అలరారుతున్న అందమైన లొకేషన్లలో చిత్రీకరించిన ఈ సన్నివేశాలు వెండితెరపై ప్రేక్షకుల్ని కనువిందు చేయనున్నాయని తెలిపారు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయని.. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నామని స్పష్టత ఇచ్చారు. మైథలాజికల్ టచ్‌తో సాగే ఈ మిస్టికల్ హారర్ థ్రిల్లర్‌లో నిధి అన్వేషకుడిగా చైతన్య అలరించనున్నారు. ఈ సినిమాకి సంగీతం: అజనీష్ లోక్‌నాథ్, ఛాయాగ్రహణం: రాగుల్ డి.హెరియన్.

# అందుకే స్క్రిప్ట్ చదవను



నా జీవితంలో స్క్రిప్ట్ రాశాను కానీ, ఎప్పుడూ చదవలేదంటున్నారు బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. తాను సినిమా స్క్రిప్ట్‌ని వినే విధానం గురించి ఆసక్తికరమైన విషయాన్ని పంచుకున్నారు. "నేను స్క్రిప్ట్ వింటాను. ఎందుకంటే నాకొక సమస్య ఉంది. దానిని చదవడం మొదలు పెట్టినప్పుడు మూడో లైన్ చదువుతుంటే నా మనసు అయిదవ లైన్ మీద ఉంటుంది. అందుకే రచయిత లేదా దర్శకుడి నుంచి ఆ స్క్రిప్ట్ వినడానికి ఇష్టపడతాను. అప్పుడు అతను ఎలాంటి సినిమా తీయాలని అనుకుంటున్నాడో చెబుతున్నప్పుడూ.. తన విజన్ ఏంటో నాకు తెలుస్తుంది. అలా కాకుండా నేను స్క్రిప్ట్ చదవడం ప్రారంభిస్తే ఆ సినిమాను ఎలా తీస్తానో అనే దానిపై నా దృష్టంతా మళ్లిపోతుంది. అందులోనూ మళ్లీ నా విజన్ దర్శకరచయితల విజన్‌కు భిన్నంగా ఉంటుంద"ని అన్నారు. 'బాఘీ', 'వీర్', 'దబాంగ్ 3' చిత్రాలలో ప్రధాన పాత్రల్లో నటించడంతోపాటు సల్మాన్ రచయితగానూ పనిచేశారు. సల్మాన్ 'మాతృభూమి' చిత్రం త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది.



# స్పెషల్ సాంగ్‌తో నేను రెడీ..

## నర్గీస్ ఫక్రీ ఫస్ట్ లుక్ రిలీజ్

హవీష్ హీరోగా త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రూపొందుతున్న చిత్రం 'నేను రెడీ'. కోనేరు సత్యనారాయణ, నిఖిలా కోనేరు నిర్మిస్తున్నారు. హవీష్‌కు జంటగా కావ్య థాపర్ నటిస్తోంది. బాలీవుడ్ నటి నర్గీస్ ఫక్రీ కూడా ఈ చిత్రంలో మెరవబోతోందని శనివారం ప్రకటించారు. ఇందులో ఆమె ఓ స్పెషల్ సాంగ్ చేస్తోంది. ఇందుకు సంబంధించి నర్గీస్ ఫక్రీ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ విడుదల చేశారు. కలర్‌ఫుల్ సెట్స్‌లో రొమాంటిక్ ఫోజ్‌లో నర్గీస్ కనిపిస్తోంది. 'రాక్ స్టార్' మొదలు 'హౌజ్‌ఫుల్ 5' వరకు పలు బాలీవుడ్ చిత్రాల్లో గ్లామరస్ రోల్స్‌లో నటించిన ఆమె.. ఈ సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇస్తోంది. ఇక వచ్చేవారం ఈ మూవీ ఆడియో రిలీజ్‌కు ప్లాన్ చేస్తున్నారు. బ్రహ్మానందం, శ్రీలక్ష్మి, వెన్నెల కిషోర్, మురళీ శర్మ, విటివి గణేష్, గోపరాజు రమణ, హరితేజ ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి మిక్కీ జె మేయర్ సంగీతం అందిస్తున్నారు.



# కేన్స్‌లో హ్యూమా సందడి

'టాక్సిక్'తో త్వరలో ప్రేక్షకుల్ని పలకరించడానికి సన్నద్ధమవుతోంది బాలీవుడ్ కథానాయిక హ్యూమా ఖురేషీ. వైవిధ్యమైన కథలతో ప్రయాణం చేసే ఈమె.. తాజాగా ప్రతిష్ఠాత్మక కేన్స్ చిత్రోత్సవాల్లో మెరిసింది. ఇటీవలే ఈ ఫిల్మ్ ఫెస్టివల్ ఫ్రాన్స్‌లో వైభవంగా ప్రారంభమైన సంగతి తెలిసిందే. పలువురు భారతీయ సినీతారలు ఈ వేదికపై సందడి చేస్తుండగా.. హ్యూమా కూడా ఈ చిత్రోత్సవాల్లో అడుగుపెట్టి సినీప్రియుల దృష్టిని ఆకర్షించింది. ఈ వేడుకలో బనారసి చీర కట్టులో కనిపించి.. ఆకట్టుకునే అందంతో ప్రపంచ వేదికపై భారతీయ వారసత్వాన్ని చాటి చెప్పింది హ్యూమా.

***GAYATHRI VARTHALU Publisher, Editor and Owned by Maddineni Nageswara Rao,*** SVN Colony, Guntur, Andhra Pradesh - 522006. PRGI Reg No - APTEL/25/A1201 .. Cell No - 7386045673 ..... Printed At SUNDAY PRINTING PRESS, SVN Colony, Guntur, Andhra Pradesh - 522006 ..Cell No - 7386045673.